# చతుష్పాది



కె. లలితా చలం

పదేళ్ళ తరువాత తన ప్రియమిత్రుడు, బాల్యస్నేహితుడైన పరమేశం వస్తున్నానని వ్రాసిన ఉత్తరం పదేపదేచదువు కుంటున్నాడు డాక్టర్ జార్జి. ఆనందంతో అతని కళ్ళు మెరిసిపోతున్నాయి. ఆ సంతోషంలో పరిసరాల్ని మరిచి పరమేశం గురించిన ఆలోచనలతో మెదడు నిండి పోయింది.

'ఇప్పుడు పరమేశం ఎలా ఉన్నాడో! అసలు నేను గుర్తుపట్టగలనో లేదో! చదువుకునే రోజుల్లో నా కంటే బాగా లావుగా ఉండేవాడు. ఈ పదేళ్ళలో ఇంకా ఇంకా లావై, గున్నేనుగులా అయి ఉంటాడు ఫూల్.' పరమేశం రూపాన్ని ఊహించుకుని నవ్వుకున్నాడు జార్జి.

పదినిమిషాల వ్యవధిలో నర్స్ లక్ష్మి రెండు మాట్లు వచ్చివెళ్ళింది. కొత్త పేషంటు వచ్చిందని చెప్పింది ఒక మాటు. మరోమాటు నిన్న డెలివరీ అయిన కాంతం బేబీ చచ్చిపోయిందని చెప్పింది. ఆ రెండు మాటలకీ ఒకే సమాధానం "గుడ్. టైమ్ నోట్‌చెయ్యి." అని చెప్పాడు డా॥ జార్జి. మళ్ళీ మూడో మాటు వచ్చింది నర్స్ లక్ష్మి. సీమకి డెలివరీ అయింది. బాయ్" అంది నవ్వుతూ. దానికి కూడా సమాధానం "గుడ్. టైమ్ నోట్‌చెయ్యి" అనే చెప్పాడు డా॥ జార్జి పరధ్యానంగా.

డాక్టరు పరధ్యానంగా ఉండి చెప్పినా నర్స్ తు. చ. తప్పకుండా అన్నీ నోట్ చేసి టేబుల్‌మీద పెట్టి డాక్టరు వంక చూసింది. రివాల్వింగ్ చైర్లో కూర్చుని ఏదో ఆలోచిస్తూ మధ్య మధ్య నవ్వు కుంటున్నాడు డా॥ జార్జి. అతను ఏమి ఎక్కడచూస్తున్నాడో అతనికి ఏం కనిపిస్తోందో! నర్స్‌కి కనిపించలేదు కానీ, జార్జికి స్పష్టంగా కనిపిస్తోంది. గతం కళ్ళముందు సినిమాబొమ్మల్లా కదులు తున్నాయి, గతించిన దృశ్యాలు.

చిన్నప్పుడు తనూ పరమేశం, ఆడ్తూ, పాడుతూ, కొట్లాడుకుంటూ మళ్ళీ కలుసు కుంటూ ఒకే బళ్ళో చదువుకునేవాళ్ళు. స్నేహం బడితో ఆగిపోకుండా పెద్ద చదువులదాకా వచ్చింది. ఒకే చదువు కాకపోయినా ఒకే రూం లో కలిపి ఉంచింది. అందిరి దృష్టిలో పరమేశమే జార్జి, జార్జే పరమేశం; వారిద్దరికీ తేడా లేదు. వారిది ఒకే మాట. ఒకే బాట. అనిపించేది. అది నూటికి నూరుపాళ్ళు నిజం కాదు. ఒక పాలు మాత్రం లోపించకపోతే అది నిజమయ్యేది. ఆ ఒక్క పాలు ఇప్పటికీ కుమ్మరిపురుగులా మా మధ్య దూరి వెంట్రుక వాసి సందు చేసుకుని మా యిద్దరి మధ్యా కూచుంది.

అదే పరమేశం జ్యోతిషశాస్త్ర పిచ్చి. పుస్తకాల పురుగులా ఎక్కడెక్కడి పుస్తకాలో తెచ్చి చదివేవాడు. చదివిన వాడు ఊరుకోక, అడిగినవారికీ అడగని వారికీ జ్యోష్యం చెపుతానని తయారయ్యే వాడు. మా పక్కింటి వారమ్మాయి సంవత్సరం క్రితం ఆడపిల్లని కన్నది. మళ్ళీ సంవత్సరం లోపల కడుపుతో ఉంది. ఆ పిల్ల పురిటికి హాస్పిటల్ కెడు తుంటే ఎదురెళ్ళి, "నీకు మళ్ళీ ఆడపిల్లే" అన్నాడు చకచకా ఏవో లెక్కలేసి.

అది నిజమైంది. దాంతో వాడి పిచ్చి ముదిరింది. సంవత్సరం లోపల గర్భం తాలిస్తే సేమ్ సెక్స్ రిపీట్ అవడానికి అవకాశం ఉన్నది. కాని ఆ మాటంటే ఒప్పుకోడే!

మరోమాటు మాస్నేహితుడి తమ్ముడు పరీక్షకెడుతున్నాడు. "నువ్వుఫస్టుక్లాసులో పాసౌతావురా!" అన్నాడు. వాడు నిజం గానే ఫస్టులో పాసయ్యాడు. పరమేశంతో పాటు అందరికీ తెలుసు, పేపర్లు లీక్ అయినాయని, ఆ పేపర్లు సంపాదించి ఆన్సర్స్ రాసుకెడుతున్నాడనీ. మరి వాడు

ఫస్టుక్లాసులో పాసవకేంచేస్తాడు? కాని ఆ మాటంటే పరమేశం మండిపడి, "వాడి జాతకంలో తప్పడం లేదురా! నాకు తెలుసు." అన్నాడు.

"జ్యోతిషాలు, హస్తసాముద్రికాలు, అన్నీ ఉత్తమాటల్లా! అమాయకులని మరీ అమాయకుల్ని చేసి, మభ్యపెట్టి, మోసంచేసే గారడీ విద్యరా!" అని నేను ఎన్నోమాట్లు వాదించేవాణ్ని. వాడు ససేమిరా ఒప్పుకునేవాడు కాదు.

పూర్ రాస్కెల్, ఫూల్. ఇప్పుడాపిచ్చి ముదిరిందో! వదిలిందో! అనుకున్నాడు డా॥ జార్జి. "డాక్టర్! లోపలికి రావచ్చా!" అన్న గొంతు వినగానే, ఊహ పరమేశాన్ని వదిలేసి, ఇలలో పరమేశం గొంతు గుర్తుపట్టి అమాంతం లేచివెళ్ళి గట్టిగా కౌగలించుకున్నాడు పరమేశాన్ని. ఊపిరాడనంతగా నలిపి ఒదిలేశాడు, ఆ సంతోషంలో. జార్జి ఒదలగానే పరమేశం ఎగాదిగా చూశాడు జార్జిని. నల్లగా, పీలగా జండాకర్రలాగా ఉండే జార్జి, ఎత్తుకు ఒళ్ళు, నలుపువిరిగి రంగుకూడా వచ్చింది. అతన్ని అలా చూడగానే సంతోషం పట్టలేక ఎగిరి ముద్దులు పెట్టేసుకున్నాడు పరమేశం.

నర్సింగ్‌హోం పక్కనే ఉన్న తనింటికి తీసుకెళ్ళాడు జార్జి. క్షేమసమాచారాలు అడుగుతూ ఇల్లంతా చూపించాడు. ఆధునికమైన ఆ యిల్లు, అలంకరణ చూడగానే జార్జి సంపాదన అంచనా కట్టేశాడు పరమేశం కూర్చునే.

"ఏరా ఫూల్! ఏనుగులా ఉంటావనుకుంటే పీనుగులా ఉన్నావేమిట్రా?" అన్నాడు జార్జి కాఫీ అందిస్తూ.

"ఏంచెయ్యనురా! పిల్లలు పీక్కుతింటున్నారనుకో. బతలేక బడిపంతుల్నగా!" అన్నాడు నవ్వుతూ.

"ఎంతమందేమిటి పిల్లలు? ఐదా? ఆరా?" బడిపంతుళ్ళు లెక్కలేకుండా పిల్లల్ని కంటారని జా ఊహ.

'ఒరే బడుద్ధాయ్! మా ఆవిడ జాతకంలో అరడజను పిల్లలున్నా, మనం దాన్ని ఒక ఆడ, ఒక మగగా సవరించి కత్తిరించేశాం" అన్నాడు పరమేశం గర్వంగా.

'ఇంకా వీడికి జాతకాల పిచ్చి పోలేదు.' మనసులో అనుకుని, "అయితే న్యాయశాస్త్రంలా, జ్యోతిషశాస్త్రం కూడా అవసరానిబట్టి మార్చవచ్చన్నమాట" అన్నాడు నవ్వుతూ. పరమేశంకూడా శృతి కలుపుతూ,

"డాక్టరుగారు జోకులుకూడా వేస్తున్నాడే! ఫరవాలేదు. అన్నట్టు ఐదేళ్ళనుంచీ నిన్ను లక్ష్మి ప్రేమిస్తున్నట్టుంది. నువ్వూ దాన్ని గాఢంగా ప్రేమిస్తున్నావు నిజమేనా" అన్నాడు పరమేశం వేళ్ళమీద ఏవో లెక్కలేస్తూ.

జార్జి ఒక్కమాటుగా షాక్‌తిన్నాడు.

"ఏ లక్ష్మిరా! నాకు ఐదేళ్ళ క్రితమే డా॥ మేరీతో పెళ్ళయిందిరా! ఇదిగోరా ఫూల్. ఎవతో నీతో కోసింది." అన్నాడు జార్జి టేబిల్‌మీద ఫొటోఫ్రేం తెచ్చి చూపిస్తూ. జంట బాగుంది. జార్జి భార్య కడుపుతో ఉన్నట్టుంది. కాస్త కడుపు ఎత్తుగా కనిపిస్తోంది ఫొటోలో.

"ఒరే బడుద్ధాయ్! నీ కాపరంలో నీళ్ళు తోడాలని ఎవరూ అనుకోటం లేదురా! లక్షి అంటే డబ్బురా! డబ్బు. నీ జాతక ప్రకారం నీ ఇరవై ఆరవ ఏట దశ తిరుగుతుందని చెప్పానా లేదా?" అన్నాడు పరమేశం. జార్జి తేలిగ్గా నవ్వేశాడు.

'ఏడ్చావ్ లేరా ఫూల్. ప్రాక్టీసు పెట్టడమంటే దశతిరగటం అన్నమాటని అందరికీ తెలుసురా! అందులోనూ నా యింట్లో సామాన్లు కళ్ళకు కనిపిస్తున్నాయి. అంచనా వేశావురా ఫూల్! పెద్ద జ్యోతిషశాస్త్రం చెవులో చెప్పినట్లు కబుర్లు చెప్పకు' అనుకున్నాడు మనసులో. ఎన్నో సంవత్సరాల తరువాత కలిసిన స్నేహితుడిని ఏమీ అనలేక నవ్వి ఊరుకున్నాడు జార్జి.

"ఏరా! నీ ముప్పై, ముప్పైఒకటి మధ్య నువ్వు పితృస్థానాన్ని ఆక్రమించి ఉండాలే!" అన్నాడు. ఏటో చూసి లెక్కలేస్తూ, అనుమానంగా చూశాడు.

"ఒరే పరమేశం! కడుపుతో ఉన్న నా భార్య ఫొటో చూసావు. ఆమెకు డెలివరీ అయిందో లేదో తెలీటంలేదు పాపం నీకు. నా భార్య కంటే, నేను తండ్రినికాక తాత నౌతానేమిట్రా!' అని మనసులో అనుకుని. —

"ఇంకాలేదురా! రేపోమాపో మేరీకి డెలివరీ అవుతుంది."

"రా! మామగారు కట్టించి ఇచ్చిన నర్సింగ్‌హోం చూద్దువుగాని" అంటూ పరమేశాన్ని తీసుకుని వెళ్ళి అంతా చూపించాడు. పరమేశం పరమానందం పొందాడు. తన బాల్యస్నేహితుడు ప్రాణమిత్రుడు వృద్ధిలోకి వస్తున్నందుకు.

"ఒరే! నేను పనిమీద ఈ ఊరు వచ్చాన్రా! నిన్ను చూశా. సంతోషించా. నీ భార్య ఇంట్లో ఉంటే మీ యింట్లో మీతో కలిసి భోంచేసేవాణ్ని. ఫరవాలేదు. రాత్రికి మా హోటల్‌కి రా! కలిసి భోంచేద్దాం కబుర్లు చెప్పుకుంటూ" అని వెళ్ళిపోయాడు పరమేశం. జార్జి చెయ్యి ఆప్యాయతగా నొక్కి. అంతలో నర్స్ లక్ష్మి వచ్చింది.

"డాక్టర్! డాక్టర్ మేరీ డెలివర్డ్. మేల్ బేబీ. ఇప్పుడే ఫోన్ వచ్చింది. టైమ్ నోట్‌చేసి పెట్టాను." అంటూ ఛార్టు అందించింది.

జార్జి సంతోషంతో "థాంక్స్" అంటూ ఛార్టు పరిశీలించాడు. కొత్త రోగిని ఎడ్మిట్‌చేసిన టైమ్ వివరాలు, బిడ్డ చనిపోయిన సమయం వివరాలు, దాని క్రింద డా॥ మేరీ డెలివరీ అయిన సమయం, మగ బిడ్డ, తదితర వివరాలు రాసి ఉన్నాయి. సీమకు మగబిడ్డ. మేరీకి


మగబిడ్డ. డా॥ జార్జికళ్ళు ఒక్కమాటుగా మెరుపులా మెరిశాయి. "గుడ్ వెరీగుడ్" అనుకున్నాడు.

సాయంత్రం ఒక స్వీట్ పాకెట్ చేతబుచ్చుకుని పరమేశం రూముకెళ్ళాడు డా॥ జార్జి. జార్జి చెప్పిన శుభవార్త విని సంతోషం పట్టలేక ఒకరినొకరు కౌగలించుకున్నారు.

"ఒరే ఫూల్. నువ్వు మధ్యాన్న మన్నట్లుగా నేను డాడీ నైపోయాన్రా!" అన్నాడు జార్జి గర్వంగా, ఏదో సాధించినట్లుగా. అప్పుడు తను ఆకాశమంత ఎత్తు ఎదిగిపోయినట్లు; తన మాటకు తిరుగులేదన్నట్లు గర్వంగా కాలరెత్తుకున్నాడు పరమేశం.

"కంగ్రాట్యులేషన్స్‌రా! బడుద్ధాయి డాడీ!" అంటూ అమాంతం ఎత్తుకుని గిరగిరా తిరగాలనుకుని జార్జిని ఎత్తబోయాడు. జార్జిని ఎత్తలేకపోగా ఆ శ్రమకి కుర్చీలో కూలబడి కొంతసేపు ఆయాసం మాత్రం పడ్డాడు. జార్జికి పరమేశాన్ని చూస్తే నవ్వొచ్చింది. ఒక కొంటె నవ్వు విసిరి, ఏదో జ్ఞాపకం వచ్చి జేబులో చెయ్యి పెడుతూ "థాంక్స్‌రా! ఫూల్! అన్నట్లు, ఈ కాగితంలో బేబీ పుట్టినతేదీ, సమయం కరెక్టుగా వ్రాయించి తెచ్చాను. నీ శాస్త్రజ్ఞానమంతా ఉపయోగించి జాతకం చెప్పరా చూద్దాం," అంటూ జేబులోంచి ఒక చిన్న కాగితం తీసి పరమేశానికి అందించాడు. పరమేశం కొద్ది క్షణాలపాటు నిశ్చేష్టుడయ్యాడు. తన చెవుల్ని తనే నమ్మలేకపోయాడు. జ్యోతిష, సాముద్రిక శాస్త్రాలను అపహాస్యంచేస్తూ అల్లరి పెట్టే జార్జేనా జాతకం చెప్పమని అడిగింది? లేక ఫూల్ ఫూల్ అని పిలవడమే కాక నిజంగా ఫూల్నిచేసి ఏడిపిద్దామనా! అని అనుమానం వచ్చి, జార్జి కళ్ళలోకి గుచ్చి గుచ్చి చూశాడు. పరమేశం అనుమానం పసిగట్టాడు జార్జి.

ఏమైనా కలిసి చేస్తారని చెప్పాసే వాళ్ళే!




"ఏమిట్రా! ఆ చూపు. వేళాకోళానికి కాదురా! నిజంగానే! లెక్కలే కడతావో, తలే బద్దలు కొడతావో నాకు తెలీదు. కాని ఆ జాతకాన్ని చక్కగా పరిశీలించి మాత్రం చెప్పాలి. నువ్వు చెప్పింది జరక్కపోవాలి! నీ బ్రేన్ ఆపరేట్‌చేసి, అందులో చేరి, కుళ్ళి, నిన్నూ నన్నూ బాధించే జ్యోతిష శాస్త్రాన్ని రూట్సుతోసహ తీసిపారేస్తాను, జాగ్రత్త," అంటూ ఓ వార్నింగ్ లాంటిది విసిరేసి కాలుమీద కాలువేసుకుని పరమేశాన్నే చూస్తూ కూర్చున్నాడు జార్జి.

'ఏడ్చావులేరా బడుద్ధాయ్! నీకాఛాన్సు లేదు. రాదు. మనం చెప్పింది జరక్కపోవడం అసంభవం.' అనుకున్నాడు మనసులో పరమేశం. తన శాస్త్రజ్ఞానం మీద తనకుగల నమ్మకం, ధీమాతో కాగితంవంక చూశాడు. వేళ్ళు లెక్కించి లెక్కలువేశాడు. జార్జివంక అనుమానంగా చూశాడు. మళ్ళీ మళ్ళీ లెక్కించాడు. చిరాకుగా, ఏదో అనుమానంతో మళ్ళీ చూశాడు. పరమేశం చర్యలన్నీ పరికిస్తూ "పిచ్చివాడు" అనుకున్నాడు జార్జి. పరమేశం లెక్కలుపూర్తిచేసి, తలెత్తి.

"ఇది మగబిడ్డ జాతకం." అన్నాడు. జార్జి ఔనన్నట్లు తలూపి,

"ఏరా ఫూల్! ఇందాక నాకు మగబిడ్డ పుట్టాడని చెప్పాను కనక ఖచ్చితంగా ఆ జాతకం మగబిడ్డదని చెప్పావురా! ఊ ఊ కానీ! చెప్పు! చెప్పు!" అనుకుని మనసులోనే నవ్వుకున్నాడు జార్జి.

"పుట్టుక పేదదైనా జాతకం మహా గొప్పదిరా!" అన్నాడు మళ్ళీ.

"మా మామ లక్షాధికారనీ, నా భార్య నా మామకు ఏకైక పుత్రికనీ ముందే చెప్పి తప్పు చేశాన్రా. ఇంత ఆస్థిపాస్థి ఉండగా నా కొడుకు గొప్ప జాతకుడని నష్టజాతకుడని ఎలా చెప్తావురా! పెరిగితేనే గొప్పవాడయేది." అన్నాడు నవ్వుతూ.

"ఈ జాతకులకి పుట్టిన మూడు మాసాల్లో రాజయోగం పడుతుంది." అన్నాడు పరమేశం. జార్జి పెద్దగా నవ్వి,

"ఒరే! ఒరే! రాజ్యాలు, రాజులూ పోయినా, మీ జ్యోతిష శాస్త్రం నుంచి "మహారాజయోగం" అనే పదంమాత్రం తీసెయ్యలేదురా మీ జ్యోతిషులు." అన్నాడు జార్జి.

"ఒరే! అలా నవ్వకు. శాస్త్రం అబద్ధంపురో వెయ్యోవంతు కూడా తప్పు చెప్పదురా!" అన్నాడు గుండెలమీద చెయ్యి వేసుకుని ధైర్యంగా.

"అది నీ గుడ్డి నమ్మకం. పోనీలే!

చెప్పడం అయిందా? ఇంకా ఉందా" అన్నాడు జార్జి టైం చూసుకుంటూ. పరమేశం ఎందుకో సందేహిస్తున్నాడు. చెప్పడమా, మానటమా అని. తటపటాయించి, చెప్పటానికే నిర్ణయించుకున్నాడు కొంతసేపటికి.

"మరొక్క విషయం ఉందిరా! తెలిసి చెప్పకుండా ఉండలేను. చెప్పి నిన్ను బాధపెట్టలేక ...." బాధతో తల దించుకున్నాడు పరమేశం. చెప్పకూడని విషయమేదో ఊహించాడు కాబోలు! అనుకుని పరమేశం వీపుతడుతూ,

"ఏం ఫరవాలేదు చెప్పరా! ఎంతటి భయంకరమైన నిజానైనా విని తట్టుకోగలడురా ఈ డాక్టర్ జార్జి. చెప్పు, నిస్సందేహంగా చెప్పెయ్" అన్నాడు ధైర్యానిస్తూ.

"ఈ జాతకస్థుడు చ...తు...ష్పాదిరా" అన్నాడు బాధగా. జార్జి ఆమాట వినగానే షాకు తింటాడనుకున్నాడు పరమేశం. కాని దానికి భిన్నంగా పెద్దగా నవ్వి,

"చతుష్పాదా! ఈ మాట చెప్పడానికేనా ఇంత బాధపడ్డావ్! భలేవాడివేరా! నీ లెక్క ప్రకారం ఈ జాతకస్థుడికి చదువు రాదంటావ్. మరి విద్యరాని వాడు వింతపశువని చిన్నప్పుడే మనం చదువుకున్నాంగా! అంటే నీ శాస్త్ర ప్రకారం చతుష్పాది. నాలుగు కాళ్ళ జంతువు అంటారన్నమాట. చదువు రాకపోతేనేం, రాజయోగం ఉందికదురా! లక్ష్మి, సరస్వతి ఒకచోట ఉండవని మా అమ్మ చెప్పేదిగా! అది నిజమేనేమో బాధపడకు" అని ఒకపక్క ఓదారుస్తూనే

"ఒరే! నీశాస్త్రం నిజమైతే, నాశాస్త్రం వదిలేసి నా డాక్టరుపట్టా చింపేసి మూల కూచుంటారా! మరి నీశాస్త్రం అబద్ధమైతే నువ్వూ అదేపని చెయ్యాల్రా ఫూల్. మూడునెల్ల గడువుందిలే. ఈ లోపల ఎవరైనా జాతకం చెప్పమంటే ముందుగా వారి పుట్టుపూర్వోత్తరాలతోసహా వివరాలు తెలుసుకుని లెక్కలుకట్టి అమాయకులని మోసంచేస్తూ ఉండు." అంటూ గట్టిగా ఒకదెబ్బ వీపుమీద వేసి నవ్వుతూ వెళ్ళిపోయాడు జార్జి.

ఆ అవమానం భరించలేకపోయాడు పరమేశం. రక్తం ఉడికిపోయింది. ముఖం కందగడ్డలా ఎర్రగా మారింది.

'ఒరే! నన్నుచూసి హేళనచేస్తే సహిస్తానురా! కాని శాస్త్రాన్ని తేలిక భావంతో హేళనచేశావ్. అది సహించరానిది. ఒకనాడు నా శాస్త్రం నీ కళ్ళు తెరిపించి నిన్ను హేళన చేయుగాక' కసిగా శపించాడు పరమేశం, జార్జి వెళ్ళినవైపే చూస్తూ.

## 2

రోజులు మౌనంగాదొర్లిపోతున్నాయి. డా॥ జార్జి ఒకరోజు పొద్దుటే నర్సింగ్ హోంకివచ్చేటప్పటికేతనకోసంనిరీక్షిస్తూ మెట్లుదగ్గరే నుంచున్నాడు ఆరడుగుల వస్తాదులాంటి వ్యక్తి. ఆ వ్యక్తిని ఒకమాటు చూస్తే చాలు ఎన్ని సంవత్సరాలైనా గుర్తుపట్టగలరు ఎవరైనా. అది అతని విగ్రహం ప్రత్యేకత. ఎత్తుకు తగ్గ లావు, లావు కుతగ్గ హుందా! హుందానిపెంచే గాంభీర్యత. బలిష్ఠమైన కండలు తిరిగిన చేతులు. ఎప్పుడూ ఆ చేతులు వీడని తుపాకి. ప్రతిదాన్నీ నిశితంగా చూసే ఎర్రనికళ్ళు. చూడగానే అతడు వేటగాడని తెలిసిపోతుంది. అతనే కోటీశ్వరుడు రాంప్రసాద్. పులి. అందరూ పులి అంటారు. పులి అతని బిరుదు. కాని ఎంతటి ధైర్యవంతుడైనా అతడి ఎదుట నిలబడి మాట్లాడటానికి జంకుతారు. కాని జార్జికి మంచి స్నేహితుడు. అందుకే చూడగానే నవ్వుతూ చనువుగా,

"హల్లో పులీ! ఎప్పుడు రావటం" అంటూ పలకరించాడు జార్జి.

"ఐదు నిముషాల్నించీ నిరీక్షిస్తున్నాం" గాండ్రించినట్లుగా అన్నాడు రాంప్రసాద్ పులి నవ్వీనవ్వకుండా.

"రా లో ప లి కి" ఆహ్వానించాడు డా॥ జార్జి.

"వద్దు. నర్సింగ్‌హోం కట్టావని తెలిసింది. కొడుకు పుట్టినట్లు విన్నాం. వేటకని వచ్చాం." అన్నాడు మూడు ముక్కల్లో తన రాకకి కారణం చెపుతూ.

"చాలా సంతోషం. నర్సింగ్‌హోం చూద్దువుగాని," అంటూ ముందునడుస్తూ, వివరంగా చూపిస్తున్నాడు జార్జి.

రాంప్రసాద్ పులి తన సంతోషం వెలిబుచ్చుతున్నాడు.

"చాలా బాగుంది. అన్ని వసతులతో కట్టడంవల్ల అందరికీ సౌకర్యంగా ఉంటుంది. ఇంకా ...." అని ఏదో అనబోయి హఠాత్తుగా మాట ఆపేసి కిందకు చూశాడు రాంప్రసాద్ పులి. ఒక కుక్కపిల్ల తోకాడిస్తూ నుంచుంది. అమాయకంగా రాంప్రసాద్‌పులి వంక చూసింది. రాంప్రసాద్ చురుగ్గా తలఎత్తి,

"ఈ కుక్కపిల్ల నీదేనా?" అని అడిగాడు మొరటుగా.

అసలే రాంప్రసాద్ మొండివాడు. మొరటువాడు. చండశాసనుడు. తనకి నచ్చకపోయినా, తనమాట కెవరైనా ఎదురుచెప్పినా నిర్దాక్షిణ్యంగా కాల్చి పారేసేటంత కఠినాత్ముడు.

ఆ కుక్కపిల్లవంక చూశాడు జార్జి. ఇందాకటిలాగానే తోకఆడిస్తూ నుంచుంది. అంతదాకా ఆ కుక్కపిల్ల తమతో తిరుగుతున్నట్లు జార్జి చూడలేదు. ఆ కుక్కపిల్ల కారికో, గీరో ఉండొచ్చు. అందుకే పులికి కోపం వచ్చినట్లుంది. కాల్చిపారేసినా ఆశ్చర్యపడే పనిలేదు. ఫూర్ ఫెలో అనుకున్నాడు జార్జి. అతని కళ్ళకు పులి యముడిలా కనిపిస్తున్నాడు ఆ కుక్కపిల్ల పాలిట. ముద్దుగా బొద్దుగా ఉన్న ఆ బొచ్చుకుక్కపిల్లని రక్షిం


చాలని అనిపించింది జార్జికి. సమాధానం చెప్పటానికి సంశయించాడు కొద్దిసేపు.

"ఆ కుక్క అసలు నాది కాదు. సంవత్సరం క్రితం ఎక్కడినుంచో వచ్చింది దీని తల్లి. 'సీమ' అని పిలుస్తూ అది నాకుక్కే అనుకుని పాలు రొట్టె పెట్టే వాళ్ళు. అది బలిసి చక్కగా అయింది. దానికి పుట్టింది ఈ కుక్కపిల్ల," అన్నాడు జార్జి. ఇదీ కుక్కపిల్ల కథ అన్నట్లుగా.

"అంటే ఈ కుక్కపిల్ల నీదేనన్న మాట" అన్నాడు పులి, కథవిని. "దాన్ని మేం తీసుకెళుతున్నాం" అన్నాడు. అదిరిపోయాడు జార్జి. జాలిగా కుక్కపిల్ల వంక చూశాడు. పిచ్చిముండ గోదుమ రంగు ఒత్తైన బొచ్చుతో ముద్దుగా తోకాడిస్తూ కూర్చుంది జరగబోయే ఘోరం ఏమిటో తెలియదు పాపం దానికి. జార్జికి ఆ కుక్కపిల్లమీద జాలిమాత్రమే కాదు ఇష్టంకూడా కలిగింది. దానిని పంపడం సుతారమూ ఇష్టమనిపించలేదు.

ఛీదరింపుగా ముఖంపెట్టి, "ఛీ! ఛీ! ఇది పెంటకుక్క. స్ట్రీట్ డాగ్. నీక్కావాలంటే మాంచి అల్‌సేషియన్ కుక్కపిల్లని ఇప్పిస్తా. తీసుకెళ్ళు." అంటూ మాలిని పిలిచి "ఈ కుక్కపిల్లని అవతల పడెయ్యి" అన్నాడు. వెంటనే మాలి వచ్చాడు, డాక్టరు ఆజ్ఞ పాలించటానికి.

"మాలీ! దాన్ని అవతల కాదు. మా కార్లో పడెయ్యి," అని మాలిని ఆజ్ఞాపించి "దాన్ని మేం తీసుకెడుతున్నాం. మరి వస్తా. ఎప్పుడైనా అటొస్తే మనింటికి రా!" అంటూ కారెక్కాడు రాంప్రసాద్ పులి. తన బిడ్డని ఎవరో శత్రువులు తీసుకెడుతున్నారని గ్రహించింది తల్లి కుక్క సీమ. పరిగెత్తుకెళ్ళి కుయ్‌కుయ్ మంటూ కారుచుట్టూ తిరిగింది. ఎగిరింది. మొరిగింది. కన్నీళ్ళు కార్చింది. కారులో ఉన్న కుక్కపిల్ల కూడా కుయ్ కుయ్ మంటూ అద్దాలు గీరింది. బోనులో




చిక్కిన ఎలకలా పిచ్చిగా అటూ ఇటూ పరిగెత్తింది. సీట్లు గీరింది. కొరికింది. కారులో పిల్ల, కారుబయట తల్లి.

నోరులేని మూగజీవాలను నిర్దాక్షిణ్యంగా చంపి, గుంపునుంచి వేరు చెయ్యడం తప్ప కలపడం తెలియని రాంప్రసాద్‌కు ఆ మూగజీవాల బాధ అర్థంచేసునే హృదయం లేదు. అనుకున్నది సాధించానన్న విజయగర్వంతో కారు స్టార్టుచేశాడు పులి. సీమ తనకు చేతనైనంతదూరం ఆ కారు వెనక పరిగెత్తింది, కాలంవెంట పరుగులుతీసే మనిషిలా. పరిగెత్తలేక ఓడిపోయి కూలిపోయేమనిషిలా ఓడిపోయితిరిగొచ్చింది.

## 3

కాలం ఎవరికోసం దేనికోసం ఆగదు అది అలుపూ సొలుపూ లేకుండా తిరుగుతూనే ఉంటుంది. ఒకరోజు జార్జి ఏదో పనిమీద రాంప్రసాద్ ఊరు వెళ్ళాడు. రాంప్రసాద్ పులిని చూసిపోదామనిపించి వెళ్ళాడు. భవంతి అంతా అలంకరించి దీపాలు తోరణాలతో కనిపించింది. బంధుమిత్రులతో సందడిగా ఉంది. డా॥ జార్జిని మేడమీదినుంచే చూసి ఎదురొచ్చాడు రాంప్రసాద్. జార్జికి ఎంతో మర్యాద చేశాడు. మృదువుగా మాట్లాడుతూ హాయిగా నవ్వుతున్న రాంప్రసాద్‌ను చూస్తుంటే జార్జికి ఆశ్చర్యమేసింది. కలలోకూడా మృదువుగా సౌమ్యంగా మాట్లాడని రాంప్రసాద్‌లో కలిగిన మార్పుకు కారణం ఏమిటో? ఎలా వచ్చిందో! అంతుచిక్కలేదు డా॥ జార్జికి.

"డాక్టర్ ఇప్పుడే ట్రంకాల్ మాట్లాడి వస్తా. కాలక్షేపానికి మీరు మా యిల్లు, తోట చూస్తూండండి. నేను వచ్చి మిమ్మల్ని కలుసుకుంటాను. ఏమీ అనుకోరుగదూ!" మృదువుగా శలవుతీసుకుని మేడమీదకు వెళ్ళాడు పులి.

జార్జి ఇల్లంతా పరికిస్తూ మెల్లగా తిరుగుతున్నవాడల్లా, హఠాత్తుగా ఒక గదిముందు ఆగిపోయాడు. ఆ గదిలో జరుగుతున్న దృశ్యం చూస్తుంటే జార్జికి ఒళ్ళు కంపరం పుట్టింది. పట్టరాని కోపంతో పళ్ళు పటపట కొరికాడు. అది పరాయి ఇల్లు, తను పరాయివాడన్న విషయంకూడా విస్మరించి 'ఆ ఘోరాన్ని ఆపడం నా ధర్మం' అనుకున్నాడు. వేటమీదకెగిరే పులిలాగా ఆ గదిలోకి దూసుకువెళ్ళాడు. తన చేతులో ఉన్న సెతస్కోపుతో ధబీధబీ కొట్టేశాడు.

క్షణకాలంలో భవనమంతా కుయ్యో కుయ్యో అనే శబ్దంతో మారుమోగి

పోయింది. ఇంటిల్లిపాదీ నౌకర్లతోసహా అందరూ అక్కడికి వచ్చేశారు. క్షణకాలంలో రాంప్రసాద్ కూడా అక్కడికి వచ్చేశాడు, తుపాకితోసహా. పదినిమిషాల క్రితం చూసిన సౌమ్యరూపంతో లేడు. కళ్ళు చింతనిప్పుల్లా అయిపోయి భయంకరంగా చూస్తున్నాయి. అతని రౌద్రాకారం చూసి నౌకర్లంతా ఒణికిపోతున్నారు.

"ఎవర్రా! వరప్రసాదు బాబుగార్ని కొట్టినవాళ్ళు ఎవర్రా? చెప్పండి. చెప్పకపోతే అందర్నీ కాల్చేస్తాను." ముక్కుపోణలు, గుండెలు ఎగరేస్తూ అందిరి వైపుకూ తుపాకి తిప్పుతున్నాడు పులి.

'పులి పిల్లిగా మారలేదు. నా పొరపాటు' అనుకున్నాడు జార్జి. అక్కడంతా మౌనం తాండవం చేస్తోంది. ఆ నిశ్శబ్దాన్ని ఛేదిస్తూ "వరప్రసాదు బాబుగారి సంగతేమోగానీ, క్షణం క్రితం మాత్రం, ఈ పాడు కుక్క ఖరీదుగల బెనారసీ చీర చింపుతుంటే ఊరుకోలేక చావచితకకొట్టాను," అన్నాడు జార్జి తను చేసినపని దాచకుండా.

జార్జి మాటలు విని తన ఉగ్రరూపాన్ని అదుపులో పెట్టుకోడానికి విశ్వప్రయత్నం చేస్తున్నాడు రాంప్రసాద్.

"ఏమన్నావ్ డాక్టర్! నువ్వు గనక ఈ రోజు బ్రతికిపోయావ్. మరొక్కమాటు దీన్ని వెధవకుక్క, పాడుకుక్క అని చూడు. నిన్నుకూడా ఎలా కాల్చిపారేస్తానో తెలుస్తుంది." అన్నాడు. కోపాన్ని ఎంతో అణగకొట్టాలని ప్రయత్నించి విఫలుడౌతున్నాడు. రాంప్రసాద్ కళ్ళనిండా నీళ్ళు నిండిపోయాయి.

"సారీ" అని మాత్రం అనగలిగాడు జార్జి.

"సారీలు, క్షమించటం నాకు తెయదు. నా వరప్రసాదుబాబుని నాకు ప్రసాదించిన వాడివికనక విని ఊరుకుంటున్నా డాక్టర్. అది కుక్కకాదు డాక్టర్! మా వంశానికే పరమేశ్వరుడి వరప్రసాదం ఈ భైరవుడు. మూడు తరాలుగా సంతానయోగంలేక దత్తపుత్రులే ఈ దివాణాన్ని ఏలుతున్నారు. నాకు పెళ్ళై ఇరవై ఏళ్ళైనా నాకూ సంతానం కలుగలేదు. ఎవరో, ఎవరికో పుట్టిన, నా లాంటి విశ్వాసఘాతకులు, ప్రేమలేని వారికి ఈ దివాణపు ధనాగారాన్ని హస్తగతం చెయ్యడం ఇష్టంలేక, నాతదనంతరం ఈ ధనాగారాన్ని విశ్వాస పాత్రులైన శునక సంతతికే ధారాత్తంచేస్తే బాగుంటుందనిపించింది, నర్సింగ్ హోంలో ఈ భైరవుణ్ని చూడగానే. అందుకే నిన్ను అడిగి తెచ్చుకున్నా దత్తపుత్రుడుగా. డాక్టర్! వీడు కాలుమోపిన వేళావిశేషం, మాకు వంశాకురాన్ని ఇచ్చింది. ఏడు తరాలవారికి గతులు కల్పించింది. ఇది కుక్కా డాక్టర్? ఈ చీరేకాదు అంతకు పదిరెట్లు ఖరీదుగల చీర చింపినా ఫరవాలేదు. వాడు ఏంచేసినా గొప్పే. వాడికి మేమేంచేసినా తక్కువే డాక్టర్. అందుకే ఏదో ఉడతాభక్తిగా మా ఆస్థిలో సగం వీడికీ, వీడి సంతతికీ వ్రాసేశాను." అంటూ కళ్ళనీళ్ళు తుడుచుకున్నాడు రాంప్రసాద్ పులి, వరప్రసాద నామధేయుడైన కుక్క దగ్గరకెడుతూ. జార్జికూడా ఆయన వెంట వెళ్ళాడు.

దంతం పనిచేసిన చిన్న మంచం. దానిమీద మెత్తటి వెల్వెట్ పరుపు. దాని మీద కుక్క కూర్చుని ఒళ్ళంతా నాక్కుంటోంది. నౌకర్లు పదిమంది దానికి ఉపచారాలు చేస్తున్నారు. దాని చెవులకు ముత్యాల పోగులు, మెళ్ళో వజ్రాల పటకా, కాళ్ళకి బంగారు మువ్వలు కనిపించాయి జార్జికి. పులిని చూడగానే రాకుమారిలాగా మెల్లగా లేచింది. ముందరి కాళ్ళు రెండూ రాంప్రసాద్ గుండెల మీద పెట్టి అతని ముఖమంతా నాకేసింది.

'రాజభోగం అంటే ఇదే కాబోలు,' అనిపించింది జార్జికి. ఆ మాట వెంటే పరమేశం జ్ఞాపకమొచ్చాడు. 'నువ్వు కాదురా! ఫూల్ నేన్రా!'

'ఒరే! పరమేశం నిన్ను అవహేళన చెయ్యాలని కుక్క జాతకం ఇచ్చాన్రా. అయినా నీ జ్యోతిషం ఈ కుక్క విషయంలో నిజమైందిరా! శాస్త్రం ఎప్పుడూ తప్పుచెప్పదు. చెప్పేవాడిబట్టి తప్పుతుందని నిరూపించావురా!" జార్జి మనసు పశ్చాత్తాపంతో నిండిపోయింది.

'చతుష్పాదైతే నేమిరా ఇలాంటి జాతకంతో పుడితే చాలురా' అనుకున్నాడు ఆ కుక్కని చూస్తూ.

